అలంకారప్రాయంగా సాగునీటి ప్రాజెక్టులు

- కాలువల నిర్మాణం మరిచారు
- పొలాలకు సాగునీరు అందని వైనం
- రైతులకు అందని నష్ట పరిహారం


నిండుకుండలా చిన్నేరు ప్రాజెక్టు


పిచ్చిమొక్కలతో చిన్నేరు ప్రాజెక్టు కాలువలు

తంబళ్లపల్లె : నాడు కరువుకు నిలయంగా మారిన తంబళ్లపల్లె రైతులకు సాగు అందించేందుకు నిర్మించిన ప్రాజెక్టులు నేడు అలంకారప్రాయంగా మిగిలాయి. ప్రాజెక్టులు పూర్తయి 14 ఏళ్లు కావస్తున్నా కాలువల నిర్మాణాలు చేపట్టడం మరిచిపోయారు. దీంతో పొలాలకు చుక్క సాగునీరు అందలేదు. నాటి ప్రభుత్వ ఆశయాలకు తూట్లు పొడిచారు. కాలువ నిర్మాణాలకు సేకరించిన భూములకు ఇప్పటి వరకు రైతులకు నష్టపరిహారం అందలేదు. దివంగత రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి అప్పటి ఎమ్మెల్యే కలిచెర్ల ప్రభాకర్‌రెడ్డిల కృషి ఫలితంగా 2006లో రెండు ప్రాజెక్టులు మంజూరయ్యాయి. పొలాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో ఎర్రకొండల నడుమ చిన్నేరు ప్రాజెక్టు రూ. 6.25 కోట్ల అంచనాతో కోసువారిపల్లె పంచాయతీ దబ్బలగుట్టల వద్ద దబ్బలగుట్ట ప్రాజెక్టు రూ.3.75 కోట్ల అంచనాతో ప్రాజెక్టులు నిర్మాణాలు చేపట్టి 2010లో ప్రాజెక్టులు పూర్తి చేశారు.

రైతులకు నష్టపరిహారం ఏదీ?

కాలువ నిర్మాణాల కోసం భూములు సేకరించారే తప్ప రైతులకు నష్టపరిహారం ఇవ్వలేదు. కాలువ నిర్మాణాలు చేపట్టకపోవడంతో సాగునీరు కలగానే మిగిలింది. దీంతో అప్పటి ప్రభుత్వ ఆశయాలను తూట్లు పొడిచినట్లుయింది. చిన్నేరు ప్రాజెక్టు 320 ఎంసిఎఫ్‌టీ సామర్థ్యం, దబ్బలగుట్ట ప్రాజెక్టు 230 ఎంసిఎఫ్‌టీ సామర్థ్యం ఉంది. ప్రతి ఏడాది వర్షాలకు ఈ ప్రాజెక్టులు నిండుతున్నాయి. ఈ ప్రాజెక్టులలో చేపలు కూడా 5 కేజీల నుంచి 25 కేజీల వరకు పెరగగడం ఆశ్చర్యకరం. కాలువలు పూడిపోయి పిచ్చిమొక్కలతో నిండి అడవిని తలపిస్తోంది. పర్యవేక్షణ లేకపోవడమే ఇందు నిదర్శనమని రైతులు ఆరోపిస్తున్నారు. గుండ్లపల్లి పంచాయతీలో సుమారు 70 మందికిపైగా రైతులు చిన్నేరు ప్రాజెక్టు కాలువల నిర్మాణానికి సుమారు 50 ఎకరాలు ఇచ్చారు. దబ్బలగుట్ట ప్రాజెక్టు కింద సుమారు 40 మంది రైతులు కాలువకు భూములు ఇచ్చారు.నష్ట పరిహారం అందక కార్యాలయాల చుట్టూ తిరిగి తిరిగి వేశారి మిన్నకుండిపోయారు. ప్రాజెక్టు ముంపునకు గురైన చెన్నప్పగారిపల్లె వాసులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద ఇంటి స్థలాలు, నష్టపరిహారం చెల్లించారు. ఇంకా కొంత మందికి ఇంటి స్థలాలు ఇవ్వాల్సి ఉందని ఆరోపణలు ఉన్నాయి.

తిరిగి తిరిగి అలసిపోయాం



కాలువ భూముల నష్ట పరిహారం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగి తిరిగి అలసిపోయాం. ఫలితం దక్కలేదు. మిన్నకుండిపోయాం. చిన్నేరు ప్రాజెక్టు కుడికాలువకు ఎకరా పొలం పోయింది. నష్ట పరిహారం చెల్లించి కాలువ పనులు పూర్తి చేసివుంటే వందల ఎకరాలకు సాగునీరు అంది రైతులు బాగుపడేవారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలి. – ఎం.రాజరెడ్డి, రైతు, వేపలపల్లె

పరిహారం కోసం ధర్నాలు చేశాం



దబ్బలగుట్ట ప్రాజెక్టు కాలువ నిర్మాణానికి 10 కుంటల పొలం పోయింది. అయినా కాలువ పనులు పూర్తి చేసి వుంటే రైతులం ఆనందపడేవాళ్లం. నాకు 5 ఎకరాలు సాగు అయివుండేది. పరిహారం కోసం పలు మార్లు మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నాలు చేశాం. అయినా స్పందన లేదు. అదే బాధకరం. – శేఖర్‌రెడ్డి, రైతు, గుండ్లూరువారిపల్లె.

ప్రతిపాదనలు పంపాం



చిన్నేరు, దబ్బలగుట్ట ప్రాజెక్టుల కాలువల నిర్మాణానికి, నష్టపరిహారం కోసం ప్రభుత్వ ఉన్నతాధికారులకు నివేదికలు పంపాం. వారి అనుమతి రాగానే పనులు చేపడతాం. ప్రాజెక్టుల ద్వారా సాగునీరు అందించాలనే లక్ష్యంతోనే పని చేస్తున్నాం. రైతులకు మేలు చేసేందుకు కృషి చేస్తున్నాం. – సతీష్, ఇరిగేషన్ శాఖ ఏఈ, తంబళ్లపల్లె

క్లుప్తంగా

కేశాలు దానం


కేశాలు దానం చేస్తున్న చిన్నారి దీక్షిత

మదనపల్లె సిటీ : కేన్సర్ బాధితుల మెములో చిరునవ్వులు చిందించాలన్న ఆశయంతో హెలిప్పింగ్‌మైండ్స్ సంస్థ చేపట్టిన హెయిర్ డొనేషన్ కార్యక్రమానికి మంచి స్పందన లభిస్తోంది. ఇందులో భాగంగా శుక్రవారం పలమనేరుకు చెందిన లలిత, ఎర్రప్పరెడ్డిల కుమార్తె దీక్షిత తన కేశాలను దానం చేసింది. కేశాలు దానం చేసిన చిన్నారికి పూల మొక్క అందించి ప్రసంశ పపత్రాన్ని సంస్థ నిర్వాహకులు అబూబకర్‌సిద్దిక్ అందజేశారు.

డ్రగ్స్ అలవాటుతో జీవితాలు చిత్తు


మాట్లాడుతున్న సీఐ యగంధర్

పీలేరు రూరల్ : డ్రగ్స్‌కు అలవాటు పడితే జీవితాలు చిత్తు అవుతాయని సీఐ యుగంధర్ అన్నారు. శుక్రవారం స్థానిక సంజయ్‌గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డ్రగ్స్ నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుకునే వయస్సులో విద్యార్థులు తమ ఉజ్వల భవిష్యత్తుపై దృష్టి పెట్టాలన్నారు. చెడు వ్యసనాలకు బానిసై జీవితాలు నాశనం చేసుకోరాదని సూచించారు. ఎస్ఐ బాలకృష్ణ, ప్రిన్సిపాల్ సుధాకర్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

రోడ్డు ఆక్రమణపై ఎంపీడీఓకు ఫిర్యాదు


ఎంపీడీఓ మస్తాన్‌వలీకి ఫిర్యాదు చేస్తున్న టీఎస్ఆర్ కాలనీ స్థానికులు

మదనపల్లె : మండలంలోని ఇండస్ట్రియల్ ఎస్టేట్ టీఎస్ఆర్ కాలనీలో ప్రజలు వినియోగిస్తున్న రోడ్డును కొందరు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని ఎంపీడీఓ మస్తాన్‌వలీకి ఫిర్యాదు చేశారు. శుక్రవారం టీఎస్ఆర్ కాలనీకి చెందిన మహిళలు, ఎంపీడీఓ కార్యాలయానికి వచ్చి గ్రామానికి చెందిన భూకబ్జాదారులు శంకర్‌రెడ్డి, రమణ, సహదేవరెడ్డిలు 30 ఏళ్లగా స్థానికులు వినియోగిస్తున్న రోడ్డును ఆక్రమించేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నారని, అడ్డుకోవాలని కోరారు. వినతి చేసినవారిలో శ్రీరాములురెడ్డి, నాగార్జున, రామకృష్ణ, మంగమ్మ, సుభాషిణి, మల్లిక, ఖాదర్‌బాషా, దిల్‌షాద్, యశోదమ్మ తదితరులు ఉన్నారు.

మున్సిపల్ టీపీఓగా జకీరా ఖాతూన్



మదనపల్లె : మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ ఆఫీసర్‌గా జకీరా ఖాతూన్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో మదనపల్లె టీపీఓగా బాధ్యతలు నిర్వహిస్తూ బదిలీపై చిత్తూరు కార్పొరేషన్‌కు వెళ్లారు. అక్కడి నుంచి సాధారణ బదిలీల్లో భాగంగా మదనపల్లె మున్సిపాలిటీకి బదిలీ చేస్తూ, బి.కొత్తకోట నగర పంచాయతీ టీపీఓగా ఓడీ డ్యూటీ కేటాయించారు. ప్రస్తుతం మదనపల్లె టీపీఎస్‌గా పనిచేస్తున్న సి.మురళీకృష్ణకు బి.కొత్తకోట నగరపంచాయతీలో మూడురోజుల ఓడీ విధులు కేటాయిస్తూ, అక్కడ ఓడీ విధులు నిర్వహిస్తున్న జకీరా ఖాతూన్‌ను మదనపల్లె టీపీఓగా నియమిస్తూ ఉత్తర్వులు విడుదల చేశారు.

మల్లయ్యకొండకు అదనపు బస్సు సర్వీసులు

తంబళ్లపల్లె : భక్తుల కోరిక మేరకు మల్లయ్యకొండకు అదనపు బస్సు సర్వీసులు నడుపుతామని జిల్లా ప్రజారవాణాధికారి రాము తెలిపారు. శుక్రవారం ఆయన తంబళ్లపల్లె సమీపంలోని మల్లయ్యకొండపై వెలసిన శ్రీ భమరాంబిక సమేత మల్లికార్జునస్వామి ఆలయాన్ని కుటుంబసమేతంగా సందర్శించారు. ఆలయ పూజారి వారికి స్వాగతం పలికి స్వామికి ప్రత్యేక అలంకరణతో పూజలు,అభిషేకాలు నిర్వహించి స్వామి దర్శనం కల్పించారు.

డీలర్లతో తహసీల్దార్ సమీక్ష

పెద్దతిప్పసముద్రం : మండలంలోని చౌక దుకాణ డీలర్లతో తహసీల్దార్ శ్రీరాములు నాయక్ శుక్రవారం సమీక్షించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రతి నెలా 20వ తేదీకి డీలర్లందరూ డీడీలు సకాలంలో తీయాలన్నారు. కార్డుదారులకు అందుబాటులో ఉంది నిత్యావసర సరుకులను సక్రమంగా పంపిణీ చేయాలన్నారు. సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ వెంకటరెడ్డి మాట్లాడుతూ వచ్చే నెల 1 నుంచి డీలర్లందరూ సరుకులు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట

వాల్మీకిపురం : మండలంలోని శివపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో శుక్రవారం ఉదయం శ్రీ సీతాలక్ష్మణ సమేత శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలు


లక్కీడ్రా తీస్తున్న ప్రయాణికుడు

మదనపల్లె సిటీ : ప్రయాణికులకు మెరుగైన సేవలు అందిస్తూ వారి మన్ననలు పొందాలని ఆర్టీసీ–1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక డిపో కార్యాలయంలో గేట్ మీటింగ్ నిర్వహించారు. ప్రయాణికులతో మర్యాదగా వ్యవహరించాలన్నారు. ఆదాయం పెంచే విధంగా సిబ్బంది కృషి చేయాలన్నారు. ఆర్టీసీ అందిస్తున్న సేవలు గురించి ప్రజలకు వివరించాలన్నారు. అన్ని ప్రాంతాలకు ఆర్టీసీ సర్వీసులు నడుపుతున్నామన్నారు.ఈపీకె 39.63, ఓఆర్ 73, కెంఎంపిఎల్ 5.50 తీసుకురావాలన్నారు. అనంతరం సిబ్బందికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సీఐ రేవతి, ఎంఎఫ్ రవి, సిబ్బంది పాల్గొన్నారు.

లక్కీడిప్ విజేతలు వీరే

స్థానిక ఆర్టీసీ బస్టాండు నందు శుక్రవారం మదనపల్లె–బి.కొత్తకోట రూటులో ప్రయాణికుల కోసం లక్కీ డిప్‌ను బస్టాండులో ప్రయాణికులతో డిప్ తీయించారు. విజేతల వివరాలకు డీఎం మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. బయ్యమ్మ, వంశీ, బి.వెంకటలక్ష్మిలు విజేతలుగా నిలిచినట్లు తెలిపారు.వీరు డిపోకు వచ్చి బహుమతులు తీసుకుపోవాలన్నారు. కార్యక్రమంలో సీఐ రేవతి, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా పోలీస్ అమరవీరుల దినోత్సవం


అమరవీరుల దినోత్సవం జరుపుకుంటున్న పోలీసులు

రామసముద్రం : అన్ని ప్రభుత్వ రంగాలకంటే పలు రకాల సేవలు అందిస్తున్న పోలీస్ శాఖ ఉత్తమమైనదని వైఎస్సార్ జిల్లా 11వ బెటాలియన్ ఆర్ఐ గోవిందరాజు తెలిపారు. అమరవీరుల స్మారక వారోత్సవాలలో భాగంగా రామసముద్రంకు చెందిన అమరవీరుడు రమేష్ స్మారక దినోత్సవం శుక్రవారం జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 2010 మే 14న రమేష్ హైదరాబాద్‌లోని షాలిబండలో విధులు నిర్వహిస్తున్నప్పుడు ముష్కరుల దాడిలో ప్రాణాలు పోతాయని తెలిసినా వెన్ను చూపకుండా పోరాడి వీరమరణం పొందారన్నారు. ప్రస్తుతం రామసముద్రం స్టేషన్లో హెడ్ కానిస్టేబుల్ గా పనిచేస్తున్న శాంతకుమారి తన భర్త జ్ఞాపకాలను స్మరించుకుంటూ ప్రతి ఏడాది అమరవీరుల స్మారక దినోత్సవం రోజున రమేష్ జ్ఞాపకార్థం వాలీబాల్,క్రికెట్ టోర్నమెంట్ ను నిర్వహించి బహుమతులు అందజేస్తున్నారన్నారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, క్రీడా పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో లెవన్ బెటాలియాన్ హెడ్ కానిస్టేబుల్ వెంకటరమణ, శ్రీనివాసులు, కానిస్టేబుల్ సత్యం, స్థానిక ఏఎస్ఐ హిమాచలపతి, హెడ్ కానిస్టేబుల్ లోకేష్, గంగిరెడ్డి, జడ్పీహైస్కూల్ చైర్మన్ చాంద్ బాషా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాలకార్మికులను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు


బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

కేవీపల్లె : బాలకార్మికులను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు తప్పవని పీలేరు సహాయ కార్మిక అధికారి ఆనందబాబు అన్నారు. శుక్రవారం మండలలలోని కేవీపల్లె, గర్నిమిట్టలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై అవగామహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థ నుంచి పిల్లలను విద్య ప్రోత్సహించాలని కోరారు. గ్రేట్ విజన్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ జి.వి. సుబ్రమణ్యంబాబు మాట్లాడుతూ ఎవరైనా 18 సంవత్సరాల లోపు పిల్లలు చదువుకోవడానికి ఇబ్బంది పడుతుంటే తమ సంస్థ ద్వారా విద్య, వైద్యము, పునరావాసము కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్, హెల్త్, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

అడిషనల్ డీఎంహెచ్ఓ శైలజ


మాట్లాడుతున్న అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ శైలజ

పెద్దతిప్పసముద్రం : మారిన వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో వైద్య సిబ్బంది సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ శైలజ సూచించారు. శుక్రవారం ఆమె స్థానిక పీహెచ్‌సీని అకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని రెండు పీహెచ్‌సీ పరిధిలో పనిచేస్తున్న డాక్టర్లు, ఎంఎల్‌హెచ్‌పీలకు జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో పని చేస్తున్న సిబ్బంది బాధ్యతగా పని చేయాలన్నారు. పీహెచ్‌సీ పరిధుల్లో ఎంత మంది క్షయ, కుష్టు వ్యాధిగ్రస్థులు ఉన్నారు? వారికి ఎలాంటి వైద్య సదుపాయాలు కల్పిస్తున్నారనే వివరాలు సమగ్రంగా రికార్డుల్లో ఉండాలన్నారు. పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు ఎలా ప్రబలుతాయి, వాటి నివారణ పద్ధతులను క్షుణంగా వివరించాలని సూచించారు. సమావేశంలో డాక్టర్లు పురుషోత్తం నాయక్, శంకర్, యస్దాని, డీపీసీ చెన్నారెడ్డి, టీబీ సూపర్‌వైజర్ రామక్రిష్ణ, భూపతి తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలు 15 రోజుల్లోగా పరిష్కారం


గ్రామసభలో దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసిల్దార్ ధనుంజయులు

నిమ్మనపల్లె : భూముల రీ –సర్వే పూర్తి చేసిన గ్రామాలలో నిర్వహించిన గ్రామ సభలలో అందిన రెవెన్యూ సమస్యలు 15 రోజుల్లోగా పరిష్కరించనున్నట్లు తహసిల్దార్ ధనుంజయులు తెలిపారు. శుక్రవారం నిమ్మనపల్లెలోని వారపు సంతలో రీ– సర్వే రెవెన్యూ గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు నిర్వహించిన తవళం గ్రామ సభలో 73 , టీ చౌకిల్లవారిపల్లె గ్రామ సభలో 14, నిమ్మనపల్లె గ్రామ సభలో 104 రెవెన్యూ సమస్యలపై దరఖాస్తులు అందాయన్నారు. 29, 30 తేదీలలో అగ్రహారం శివాలయం వద్ద గ్రామసభలు నిర్వహిస్తామన్నారు. గ్రామసభలలో పట్టాదారు పేరు, లేక తండ్రి పేరు, భూమి విస్తీర్ణంలో వ్యత్యాసం, జాయింట్ ఎల్‌పిఎంల విభజన, మ్యూటేషన్ లోని పొరపాట్లు, సర్వేనెంబర్, సబ్ డివిజన్ లలోని వ్యత్యాసాలు, జాయింట్ మ్యూటేషన్ విభజన, తదితర సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పాపులమ్మ, డిటి సిరాజుద్దీన్, మండల సర్వేయర్ గోపి, పంచాయతీ కార్యదర్శి వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ట


సీతారాముల విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న నిసార్‌అహ్మద్, దేశాయ్‌తిప్పారెడ్డి తదితరులు

రామసముద్రం : మండలంలోని పెద్దకురప్పల్లె పంచాయతీ, తప్పసానిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన దేవాలయంలో శుక్రవారం సీతారామచంద్రుల విగ్రహ ప్రతిష్ఠను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నిసార్ అహ్మద్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్ తిప్పారెడ్డి హాజరయ్యారు. అర్చకులు అనిల్ ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీతారాములు అందరికీ ఆదర్శమని, స్వామివారి ఆశీస్సులు అందరికీ ఉండాలన్నారు. ప్రజలు భక్తిభావం పెంపొందించుకుని సీతారామచంద్రుల అడుగుజాడల్లో నడవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు భాస్కర్ గౌడ్, రెడ్డివారి భరత్ రెడ్డి, సర్పంచ్ రెడ్డెప్ప నాయుడు, గెవన్న, ప్రకాష్, హైదర్ వలీ, తిప్పరాజు, అబ్బరాజు, ఆదినారాయణ, రామచంద్ర, సురేష్, గుణశేఖర్ నాయుడు, చెంగప్ప,కొమ్ము నారాయణస్వామి, విజయ్, లక్ష్మీపతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధి యూనిట్లు మంజూరు చేయాలి


మాట్లాడుతున్న లీడ్‌బ్యాంక్ మేనేజర్ అంజనేయులు

మదనపల్లె : వ్యవసాయ ఆధారిత అనుబంధ స్వయం ఉపాధి యూనిట్ల ఏర్పాటు కోసం రుణాలు ఇవ్వడంలో ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా లీడ్‌బ్యాంక్ మేనేజర్ జి.అంజనేయులు తెలిపారు. శుక్రవారం స్థానిక వెలుగు మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో బ్యాంకర్ల సమావేశం జరిగింది. కార్యక్రమంలో ఎల్‌డీఎం జి.అంజనేయులు, పశుసంవర్ధకశాఖ డీడీ కే.సత్యనారాయణ, ఐపీఓ డి.శంకరప్ప, డీఆర్‌డీఏ డీపీఎం లక్ష్మీప్రసాద్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎల్‌డీఎం మాట్లాడుతూ...ప్రతి బ్యాంక్ మేనేజర్ తమకు నిర్దేశించిన వార్షిక రుణలక్ష్యాలను చేరుకోవాల్సిందిగా సూచించారు. రుణాల మంజూరుకు సంబంధించిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించి అర్హులకు మేలు జరిగేలా చూడాలని సూచించారు. గ్రామాల పరిధిలో బ్యాంకింగ్ సేవలను విస్తృతం చేసి, గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకింగ్, ఆర్థికలావాదేవీలను మరింత బలోపేతం చేయాలన్నారు. సురక్షితమైన డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహించాలని సూచించారు. కిసాన్‌కార్డ్స్ అన్ని బ్యాంకులు ఇవ్వాలన్నారు. ఫుడ్‌ప్రాసెస్ యూనిట్స్‌కు రూ.10లక్షల వరకు సబ్సిడీ ఉందని, ఆసక్తి కలిగిన వారెవరైనా దరఖాస్తు చేసుకుంటే రుణాలు మంజూరుచేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

పశుగణన పోస్టర్ల ఆవిష్కరణ


పశుగణన పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డాక్టర్ నీరజ

వాల్మీకిపురం : ఈ నెల 25 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 28వ తేది వరకు జరగనున్న పశుగణన కార్యక్రమాన్ని వాల్మీకిపురం, గుర్రంకొండ మండలాలకు చెందిన 22,692 కుటుంబాలకు చెందిన పశు వివరాలను నమోదు చేయడం జరుగుతుందని పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ నీరజ తెలిపారు. శుక్రవారం స్థానిక పశువైద్యశాల ఆవరణంలో 21వ అఖిలభారత పశుగణన కార్యక్రమానికి సంబంధించి గోడపత్రికలను పశువైద్యాధికారులతో కలసి నీరజ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పశుగణన కార్యక్రమంలో పశువులు, గేదలు, గొర్రెలు, మేకలు, పందులు, గుర్రాలు, కోళ్లు, పక్షులు, కుక్కలతో సహా 16 రకాల పెంపుడు జంతువుల సమాచారం సేకరించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వాల్మీకిపురం, గుర్రంకొండ మండలాల పశువైద్యాధికారులు చరిత, అనూష, సుధీర్ రెడ్డి, సునీల్ నాయక్, సలీం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మండలంలో పశుగణన ప్రారంభం

కలికిరి : మండల పరిధిలోని 14 గ్రామ పంచాయతీలలో పది మంది ఎన్యుమరేటర్లు, ఇద్దరు సూపర్‌వైజర్లతో పశుగణన కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు కలికిరి ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డా. వెంకటమునినాయుడు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ 16 రకాల పెంపుడు జంతువుల సమాచారాన్ని సిబ్బంది ప్రజల ఇంటి వద్ద లెక్కించి యాప్‌లో అప్‌లోడ్ చేస్తారని తెలిపారు. రైతులకు ప్రధాన ఆదాయవనరుగా ఉన్న పశుసంవర్ధక రంగాన్ని మెరుగుపరచడానికి అవసరమయ్యే నిధులు, మందులు, టీకాల సరఫరా, రూపకల్పన, పర్యవేక్షణకు పశుగణన ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు.

పశుగణన పక్కాగా జరగాలి

తంబళ్లపల్లె : పశుగణనపై పశు వైద్యసిబ్బంది ప్రతి ఇంటిని సందర్శించి పూర్తి సమాచారంతో పక్కాగా నిర్వహించాలని పశుసంవర్థకశాఖ ఏడీ డాక్టర్ సుమిత్ర తెలిపారు. శుక్రవారం స్థానిక పశువైద్యశాల ఏడీ కార్యాలయంలో పశుగణన ఎన్యుమరేటర్లతో సమావేశం జరిగింది. ఎన్యుమరేటర్లు ప్రతి ఇంటిని సందర్శించి పశువులు, గొర్రెలు, మేకలు, వారు పెంచుకునే ఇతర జంతువులు పూర్తి సమాచారంతో నమోదు చేయాలన్నారు. అనంతరం 21వ అఖిల భారత పశుగణన పోస్టర్లను ఆవిష్కరించారు. ఎన్యుమరేటర్లకు కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఉపేందర్‌రెడ్డి, ఉపాధి హామీ పథకం ఏపీఓ అంజనప్ప, మండల పశువైద్యాధికారి సుజనశ్రీ పాల్గొన్నారు.

అదనపు ట్రాన్స్‌ఫార్మర్లతో నాణ్యమైన విద్యుత్

విద్యుత్ శాఖ జిల్లా ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి


ఎర్రకోటపల్లె విద్యుత్ సబ్‌స్టేషన్‌లో అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసిన అధికారులు

కలకడ : రైతులకు పగలు 9గంటల నాణ్యమైన విద్యుత్ ఇవ్వడానికి అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని ఎర్రకోటపల్లె విద్యుత్ సబ్‌స్టేషన్‌లో అదనంగా 5.0 యంవీఏ ట్రాన్స్‌ఫారం ఏర్పాటు చేశారు. 33–11 కేవీ ఎర్రకోటపల్లె సబ్‌స్టేషన్ పరిధిలో నాలుగు ఫీడర్లు పాపిరెడ్డిగారిపల్లె, నవాబుపేట, ఎర్రకోటపల్లె ఫీడర్లు ఉన్నట్లు తెలిపారు. వర్షాకాలంలో ట్రాన్స్‌ఫారాలు ఎక్కువగా కాలిపోయేవని, ఇకపై లోవోల్టేజి సమస్య రాదన్నారు. రైతులకు పగలే త్రీఫేస్ విద్యుత్ 9గంటలు సరఫరా చేయడానికి ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. కార్యక్రమంలో ఈఈలు చంద్రశేఖర్‌రెడ్డి, రమేష్, డీఈఈ శివయ్య, ఆదినారాయణ, ఏఈలు అన్నమయ్య, సుబ్రమణ్యం, రాజశేఖర్, వరప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి ఉరుసేషరీఫ్

మదనపల్లె : మండలంలోని శానిటోరియంలో హజరత్ గౌసే ఆజం దస్తగీర్ పీరానేపీర్ 35వ ఉరుసేషరీఫ్ మహోత్సవం శనివారం నుంచి ప్రారంభమవుతుందని ప్రెసిడెంట్ అహ్మదున్నిసాబి, దర్గా కమిటీ మెంబర్లు నాసిర్‌బాషా, జమీల్ తెలిపారు. శుక్రవారం వారు మీడియాతో మాట్లాడుతూ హజరత్ గౌస్ ఆజం దస్తగీర్ పీరానేపీర్ సందల్ ముబారక్ మదనపల్లె దక్నీపేటలోని అహ్మదున్నీసాబీ ఇంటి నుంచి తాజియాలో, మేళతాళాలతో, పూలచాదర్, ఫకీర్ల రాతిబ్‌తో ఊరేగింపుగా శనివారం సాయంత్రం గంధం బయలుదేరి రాత్రి 9 గంటలకు దర్గాకు చేరుకుంటుందన్నారు. ఆదివారం సాయంత్రం నమాజ్ తర్వాత అన్నదానం, ఖవ్వాలి పాట కచ్చేరి జరుగుతుందన్నారు. ఉరుసు మహోత్సవానికి పెద్దసంఖ్యలో ప్రజలు హాజరై విజయవంతం చేయాలన్నారు.

ఎంసీఏ కోర్సు ప్రారంభం

కురబలకోట : అంగళ్ల సమీపంలోని విశ్వం ఇంజినీరింగ్ కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరం నుంచి ఎంసీఏ కోర్సు ప్రారంభిస్తున్నట్లు కళాశాల చైర్మన్ ఎం.ప్రభాకర్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ డి. రమణారెడ్డి తెలిపారు. పట్టణ, గ్రామీణ ప్రాంత విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఉన్నత ప్రమాణాలతో కార్పొరేట్ కళాశాలలకు దీటుగా సౌకర్యాలను కల్పిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే కళాశాలకు అటానమస్ స్థాయి ఉందని మొదటి బ్యాచ్‌ను అత్యున్నత బాధ్యతతో వ్యవహరించడం జరుగుతుందని తెలిపారు. అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాల్సిందిగా కోరారు.

హాస్టల్ విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

పీలేరు రూరల్ : హాస్టల్ విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని 11వ అదనపు జిల్లా కోర్టు జడ్జి ఎ. మహేష్ అన్నారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు శుక్రవారం స్థానిక ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ జడ్జి తనిఖీ చేశారు. హాస్టల్ నందు అందుతున్న సౌకర్యాల గూర్చి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం భోజనం అందుతుందా లేదా అని, నాణ్యత ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల పట్ల వార్డెన్, ప్రిన్సిపాల్ ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రసాద్ రావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి కృషి

పీలేరు : రైతుల భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని డిప్యూటీ తహసీల్దార్ సుబ్రమణ్యం అన్నారు. శుక్రవారం మండలంలోని మద్దెలచెరువు పొలంలో భూముల రీసర్వే గ్రామ సభ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఒకరికి చెందిన భూములు మరొకపేరిట ఆన్‌లైన్‌లో నమోదు అయి ఉన్నా, సరిహద్దులు నిర్ణయించడంలో తప్పిదాలు ఉన్నా సరి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

మదనపల్లె సిటీ : ఇంజినీరింగ్ విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్ మోటివేటర్ జితేంద్ర అన్నారు. శుక్రవారం చిత్తూరు రోడ్డులోని ఆదిత్య ఇంజనీరింగ్ కాలేజీలో బిటెక్ మూడవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఇంజనీరింగ్ తరువాత ఉద్యోగ అవకాశాలు అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇంజినీరింగ్ పూర్తి చేసిన వెంటనే పలు ఉద్యోగ అవకాశాలు ఉంటాయన్నారు. విద్యార్థులు తమ కెరీర్‌ను ఎలా మలుచుకుని ముందుకు వెళ్లాలన్నారు. తమ కెరీర్‌లో ఎలా ముందుకు వెళ్లాలో అనేది వివరించారు. కార్యక్రమంలో కాలేజీ డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ సతీష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక

తంబళ్లపల్లె : స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ స్థాయి పోటీలకు తంబళ్లపల్లె విద్యార్థి సుదర్శన్‌నాయక్ ఎంపికై నట్లు కోచ్, పీఈటీ దేశ్‌ముఖ్ తెలిపారు కర్నూలులో శుక్రవారం జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో సుదర్శన్‌నాయక్ పాల్గొన్నాడు. సుదర్శన్ ఎస్‌టీ బాలుర రెసిడెన్షియల్ పాఠశాలలో పదోతరగతిలో పూర్తి చేసి ములకలచెరువు ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్ చదువుతున్నాడు. అథ్లెటిక్స్‌పై కోచ్ దేశ్‌ముఖ్ దగ్గర శిక్షణ పొందాడు. అథ్లెటిక్స్ ట్రిపుల్ జంప్ విభాగంలో 12.45 మీటర్ల జంప్‌లో ప్రతిభ చాటి ద్వితీయ స్థానంలో నిలిచాడు. నవంబర్‌లో జార్ఖాండ్ రాష్ట్రం రాంచీలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని కోచ్ తెలిపారు. ప్రిన్సిపాల్ అల్తాఫ్‌భాను, షబానా, ఉపాధ్యాయులు అభినందించారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

కేవీపల్లె : విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అన్నపూర్ణ అన్నారు. శుక్రవారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు మత్తు పదార్థాల వలన కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గంజాయి, మద్యం లాంటివి సేవించడం వల్ల జీవితాలు నశనమవుతాయన్నారు. వాటి వల్ల సమాజంలో గౌరవం తోపాటు తమ ఆరోగ్యం కోల్పోతారని, ఆర్థికంగా నష్టపోతాచని తెలిపారు. అలాగే బాల్య వివాహాలు అరికట్టడానికి ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమన్నారు. హెల్ప్ లైన్ నెంబర్ 1098, 112, 181, పోక్సో యాక్టు 2012, చైల్డ్‌మ్యారేజ్ యాక్ట్ 2006పై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో మహిళా పోలీసు శివకుమారి, డీసీపీయూ సోషల్ వర్కర్ లావణ్య, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.